సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం, 27, మే, 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు తాడూరి రంగారావు, వెంకట రమణి దంపతులు (కాకినాడ) ఆదివారం రూ.25 వేల విరాళం సమర్పించారు.



రూ.50 వేల విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నాగవరపు హరిబాబు (ఒంగోలు) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0° / 27.6°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	29.0
కాకినాడ	37.0	27.6
అమలాపురం	39.0	28.0

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగ అందించేందుకు దేవస్థానం ఆధ్వర్యాన 70 లీటర్ల పెరుగు అందజేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా ఆలయానికి రూ.1,64,476 ఆదాయం వచ్చిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

కిక్కిరిసిన రత్నగిరి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా భక్తులు ఆదివారం రత్నగిరికి పోటెత్తారు. వాతావరణం చల్లగా ఉండటం, విద్యా సంస్థలకు సెలవులు తదితర కారణాలతో భక్తులు భారీ సంఖ్యలో సత్యదేవుని దర్శనానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు 2,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. మూడు రోజుల కిందటి వరకూ 40 డిగ్రీల సెల్సియస్‌కు పైబడిన ఎండలతో ఆలయ ప్రాంగణంలో నిలబడటానికి, నడవడానికి అవస్థలు పడిన భక్తులు.. ఇప్పుడు చల్లని వాతావరణంతో సేద తీరుతున్నారు. పలువురు ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. విశ్రాంతి మండపాల్లో సేద తీరుతున్నారు.

లోవలో భక్తుల రద్దీ

తుని రూరల్: వాతావరణం చల్లగా ఉండటంతో తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చిన 8 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,06,415, పూజా టికెట్లకు రూ.93,390, కేశఖండన శాలకు రూ.25,580, వాహన పూజలకు రూ.2,150, వసతి గదులు, కాటేజీలు, పొంగలి షెడ్ల అద్దెలు రూ.81,556, విరాళాలు రూ.26,179 కలిపి మొత్తం రూ.4,35,450 ఆదాయం సమకూరిందని వివరించారు.

బంగారు భవితకు..

- గడప గడపనా ఐఈఆర్‌పీల సర్వే
- ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల గుర్తింపు
- జూన్ 9 వరకూ నిర్వహణ
- ఇప్పటి వరకూ 250 మంది నమోదు
- సమగ్ర శిక్ష ద్వారా పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి



సీతానగరం మండలం కాటవరంలో ఐఈఆర్‌పీల సర్వేను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ కన్నబాబు

రాజమహేంద్రవరం రూరల్: అన్ని అవయవాలూ సక్రమంగా ఉండి, ఆరోగ్యంగా ఉన్న చిన్నారులు వారి అనుభూతులను తల్లిదండ్రులతో పంచుకోగలరు. దివ్యాంగులైన చిన్నారులు మాత్రం వారి ఆనందాన్ని, కష్టాలను, అనుభూతులను పూర్తి స్థాయిలో వ్యక్తం చేయలేరు. అటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఇంటికే పరిమితం కాకుండా.. మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందేందుకు, మిగిలిన వారితో పాటు సమానంగా ఎదిగేందుకు సమగ్ర శిక్షా ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు బంగారు భవితను అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. మిగిలిన చిన్నారుల మాదిరిగానే వారు కూడా అన్ని అవకాశాలూ అందిపుచ్చుకునే విధంగా ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రం ఏర్పాటు చేసి, సహిత విద్యను ప్రవేశపెట్టింది. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఇంటికే పరిమితం కాకుండా.. మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు భవిత కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో 19 భవిత కేంద్రాలు, 23 స్పెషల్ ఎడ్యుకేషనల్ స్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన 886 మంది చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. వీరిలో అవసరమైన వారికి వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ ఇప్పిస్తున్నారు.

ఇదీ లక్ష్యం

సమాజంలో ఈ ప్రయోజనాలు పొందకుండా ఇంకా మిగిలి ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించేందుకు భవిత కేంద్రాల్లోని ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్లు (ఐఈఆర్‌పీ) ఈ నెల ఒకటో తేదీ నుంచి సర్వే చేస్తున్నారు. ఆయా మండలాల పరిధిలో పూర్తి స్థాయిలో మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వేసవి సెలవుల్లోనే ఈ సర్వే చేయాలనే అధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంల సాయంతో ఐఈఆర్‌పీలు ఈ సర్వే చేస్తున్నారు. వచ్చే నెల 9వ తేదీ వరకూ ఈ సర్వే కొనసాగనుంది. ఇంక్లూజన్-2025లో భాగంగా దివ్యాంగ చిన్నారులందరికీ అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారినీ వారి వయస్సుకు తగిన పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. సమగ్రశిక్ష ద్వారా మానసిక దివ్యాంగులకు, విద్యార్థి దశలో ఉన్న వారికి విద్యాబుద్ధులు నేర్పించేందుకు, ప్రతి వారం ఫిజియోథెరపీ ఇప్పించి, వారికి అవసరమైన పరికరాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సర్వేలో భాగంగా ఇలాంటి పిల్లలు ఇంకా ఉంటే గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి, పాఠశాలలకు రప్పించేలా ఐఈఆర్‌పీలు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక అలవెన్సులు

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులు అందజేస్తోంది. బడికి వచ్చే మానసిక, బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకు, ఇంటి వద్ద ఉంటున్న వారికి, ఆడపిల్లలకు ఈ ప్రత్యేక అలవెన్సులు ఇస్తున్నారు.

- బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్సు కింద రూ.200 చొప్పున పది నెలలకోసారి రూ.2 వేలు అందజేస్తున్నారు.
- బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్సు కింద రూ.300 చొప్పున పది నెలలకు రూ.3 వేలు ఇస్తున్నారు.
- ఆడపిల్లలకు ప్రత్యేకంగా గర్ల్ చైల్డ్ అలవెన్స్ కింద నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2 వేలు ఇస్తున్నారు.
- హోమ్ బేస్డ్ అలవెన్స్ కింద బడికి రాని ఇంటి వద్ద ఉన్న ప్రత్యేక అవసరాల కలిగిన వారికి నెలకు రూ.300 చొప్పున పది నెలలకు రూ.3 వేలు అందిస్తున్నారు.
- బడికి వెళ్తున్న వారికి పాఠశాలలోని మిగిలిన అందరు విద్యార్థులతో పాటు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, షూ, టైలు అందజేస్తున్నారు. అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తున్నారు. దివ్యాంగ చిన్నారుల విద్యను డిజిటలైజ్ చేసి, ట్యాబులు కూడా అందజేయడం గమనార్హం.

ప్రత్యేక శిబిరాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యాన జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు కలిగిన 390 మంది పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ చిన్నారులకు వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి, వారికి ఎటువంటి పరికరాలు అవసరమో గుర్తించారు. వారికి త్వరలోనే పరికరాలు అందించనున్నారు.

250 మంది గుర్తింపు



ప్రస్తుతం ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్‌పీలు నిమగ్నమయ్యారు. జిల్లాలో ఇప్పటికే కొత్తగా 250 మందిని గుర్తించారు. ఇటీవల నిర్వహించిన క్యాంపులలో బడి ఈడు పిల్లలు కూడా ఉన్నారు. వారందరూ బడికి వచ్చే అవకాశాలున్నా రావడం లేదు. అటువంటి వారిని చైతన్యపరిచి భవిత కేంద్రాలకు రప్పించి, అక్కడ విద్యాబుద్ధులు నేర్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. శిబిరాలతో పాటు ఈ సర్వే ద్వారా కూడా ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా ఆయా పరికరాలు అందజేసేందుకు కృషి చేస్తాం.

– సిరిపురపు సుభాషిణి,
జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్,
సమగ్ర శిక్ష, రాజమహేంద్రవరం

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ప్రారంభం కానుంది. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ప్రక్రియ జరుగుతుందని ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కన్వీనర్ వి.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు ఒకటి నుంచి 12,000 వరకూ ర్యాంకులు పొందిన విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ప్రాసెసింగ్ ఫీజు రశీదుతో పాటు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి హాల్ టికెట్, మార్కుల జాబితా ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ, 4 నుంచి 10 తరగతుల వరకూ స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వారైతే 2021 జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకుని రావాలని పేర్కొన్నారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వివిధ పూజలు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో 89 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకాల్లో ఐదుగురు, లక్ష్మీగణపతి హోమంలో 46 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. 29 వాహన పూజలు, 16 మంది చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాసాలు జరిగాయి. స్వామివారి అన్నదాన పథకంలో 2,350 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదానం విరాళాలుగా రూ.3,05,886 లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

రెమాల్ అలజడి



బీచ్ రోడ్డుపై ప్రవహిస్తున్న సాగర జలాలు



బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్న పోలీసులు



ఉప్పాడ - కాకినాడ బీచ్ రోడ్డుపై విరుచుకుపడుతున్న భీకర కెరటాలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన రెమాల్ తుపాను ముప్పు మన రాష్ట్రంపై లేనప్పటికీ, దీని ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్రం ఆదివారం అల్లకల్లోలంగా మారింది. అలలు పెద్ద ఎత్తున ఎగసి పడటంతో ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతాల్లోని ఇళ్లు, ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతున్నాయి. భీకర కెరటాలు విరుచుకుపడుతూండటంతో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు అలలు ఎగసి పడుతున్నప్పటికీ బీచ్ రోడ్డులో పలువురు ప్రయాణాలు సాగించారు. ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. అయినప్పటికీ పలువురు తీరానికి చేరుకుని సాగర కెరటాల కల్లోలాన్ని వీక్షించేందుకు ఉత్సాహం చూపారు.

ఆహా ఏమి రుచి..

- పల్లెల్లో జోరుగా మామిడి తాండ్ర తయారీ
- వేసవిలో కూలీలకు ఉపాధి
- కాకినాడ జిల్లాలో 17 పరిశ్రమలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు



తాండ్ర తయారీకి మామిడి రసాన్ని పొరలుగా పోస్తారిలా..



తాండ్ర తయారీకి దిగుమతి చేసుకున్న మామిడి కాయలు

కాకినాడ రూరల్: చలికాలం మళ్లి వేసవి వస్తోందంటే చాలు.. ఎక్కడ చూసినా మామిడి హడావిడే. పిందెలుగా, చిన్నచిన్న కాయలుగా ఉన్నప్పుడు ముక్కలు కోసి, ఉప్పు, కారం అద్దుకుని లొట్టలు వేసుకుని తింటూంటారు. కాయ కాస్త ఎదిగి, టెంక కట్టిన తర్వాత రకరకాల ఊరగాయలు పెట్టుకుని, చూస్తేనే నోరూరే ఆ సరికొత్త రుచులను చవి చూస్తారు. ఇక పండ్ల సీజన్ వస్తే చాలు.. ఏ మార్కెట్ చూసినా.. ఏ ఇంట్లో చూసినా మామిడి ఘుమఘుమలే. ఎవ్వరూ చూడకుండా మామిడి పండ్లను దాచేయడం ఎవ్వరికీ సాధ్యం కాదు. అవి వెదజల్లే సువాసనలే వాటి జాడను పట్టిచ్చేస్తాయి. ఆ మధుర ఫలాన్ని పిన్నల నుంచి పెద్దల వరకూ ఆనందంగా ఆస్వాదిస్తారు. మళ్లీ అందులోనూ కొత్తపల్లి కొబ్బరి, పండూరు మామిడి, బంగినపల్లి, రసాలు, పంచదార కలశ, ఇమాం పసందు.. ఇలా రకానికో రుచిని అందించడం మామిడికే ప్రత్యేకం. సీజన్ అయిపోయాక కూడా మామిడి పండ్ల గుజ్జుతో తయారు చేసే తాండ్రను కూడా ప్రతి ఒక్కరూ ఆనందంగా తింటూంటారు.

కుటీర పరిశ్రమగా..

పండ్ల గుజ్జు, రసాల్లో చక్కెర కలిపి, పొరలుపొరలుగా పోసి, తగినంతగా ఎండబెట్టి, ముక్కలుముక్కలుగా కోసి, తాండ్ర తయారు చేస్తారు. దీని తయారీకి ఏ పండు రసమైనా వాడవచ్చు కానీ ఎక్కువగా మామిడి పండ్ల గుజ్జుతోనే తాండ్ర తయారు చేస్తారు. కొన్నిచోట్ల తాటి పండ్ల గుజ్జుతో కూడా తయారు చేస్తూంటారు. మామిడి పండ్ల గుజ్జుతో తాండ్ర తయారు చేయడంలో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు ప్రత్యేక స్థానం ఉంది. కాకినాడ రూరల్, గొల్లప్రోలు, పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని, తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట గ్రామాలు, కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం వంటి ప్రాంతాల్లో తాండ్ర తయారీ కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతోంది. కాకినాడ జిల్లాలో ముఖ్యంగా కాకినాడ రూరల్ మండలం పండూరు, సర్పవరం, తమ్మవరం గ్రామాలు తాండ్ర తయారీకి ప్రసిద్ధి. సర్పవరంలో సుమారు 80 ఏళ్ల క్రితం ప్రారంభమైన తాండ్ర తయారీ నేడు చేబ్రోలు, చిన్నయ్యపాలెం, ధర్మవరం, జగ్గంపేట మండలం రాజపూడి, మల్లిసాల తదితర గ్రామాలకు విస్తరించింది. తుని తదితర ప్రాంతాల్లో కూడా తాండ్ర పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 17 చోట్ల సీజనల్‌గా తాండ్ర తయారీ జరుగుతోంది. కాకినాడ రూరల్‌లోనే మూడు గ్రామాల పరిధిలో 12 కుటీర పరిశ్రమల ద్వారా తాండ్ర తయారు చేస్తున్నారు. ఈ తాండ్ర తయారీకి ఈ ప్రాంతంలో పండే వాటితో పాటు కృష్ణా జిల్లా నూజివీడు, ఖమ్మం, చిత్తూరు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల నుంచి పక్వానికి వచ్చిన మామిడి కాయలను లారీల్లో భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాకు ఏటా 80 వేల టన్నుల పైబడి మామిడి దిగుమతి అవుతుందని అంచనా. ఎక్కువగా కలెక్టర్ రకం మామిడి కాయలనే నాణ్యమైన తాండ్ర తయారీ వినియోగిస్తారు. వీటిని టన్ను రూ.20 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది ఇతర రకాలు కూడా ఉపయోగిస్తారు.

తయారీ ఇలా..

పక్వానికి వచ్చిన మామిడి పండ్లను ప్రత్యేకంగా రూపొందించిన యంత్రంలో వేసి, గుజ్జు లేదా రసాన్ని సేకరిస్తారు. దీనిలో తగినంత చక్కెర కలుపుతారు. అనంతరం ఆ రసాన్ని వడకట్టి, తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన పందిళ్లపై తాటాకు చాపలు వేసి, వాటిపై పలుచని పొరలా పోసి, ఎండబెడతారు. అది కాస్త గట్టి పడిన తరువాత దానిపై మరో పొరగా మామిడి రసం పోసి ఎండబెడతారు. ఇలా కావలసినంత మందం వచ్చేంత వరకూ పొరలు పోస్తూనే ఉంటారు. ఎండ తీవ్రతను బట్టి ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి రెండు నుంచి నాలుగు వారాల వరకూ పడుతుంది. బాగా ఎండిన తర్వాత దానిని కావలసిన సైజులో ముక్కలు ముక్కలుగా కోసి విక్రయిస్తారు.

ఏడాది పొడవునా..

కేవలం వేసవిలోనే తాండ్ర తయారీతో సరిపెట్టుకోకుండా కొంత మంది ఏడాదికి అవసరమైన మామిడి రసాన్ని తయారు చేసుకుని నిల్వ చేసుకుంటున్నారు. తద్వారా డిమాండ్‌కు అనుగుణంగా ఏడాది పొడవునా తాండ్ర తయారు చేస్తున్నారు. దీనిపై ఆధారపడి వేసవి సీజన్‌లో ఏటా 2 వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. అన్ సీజన్‌లో వెయ్యి మందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఇక్కడ తయారయ్యే తాండ్రను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నారు. కాకినాడ జిల్లా నుంచి ఏటా సుమారు 50 వేల నుంచి 70 వేల టన్నుల వరకూ తాండ్ర ఎగుమతి అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం తదితర ప్రాంతాల నుంచి ఇతర దేశాలకు కూడా మామిడి తాండ్రను ఎగుమతి చేస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు

దాదాపు 20 గ్రాముల తాండ్రలో 67 కేలరీలు, 0.3 గ్రాముల ప్రొటీన్, 0.1 గ్రాముల కొవ్వు, 17.5 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఉన్న విటమిన్–ఎ శరీర ఆరోగ్యంతో పాటు, కంటి చూపునకు ఎంతో మేలు చేస్తుందని చెబుతారు. అలాగే, తాండ్రలో విటమిన్–సి రోగ నిరోధక శక్తిని పెంచేందుకు, వ్యాధుల నుంచి రక్షణకు దోహదపడుతుంది. తాండ్రలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు మేలు చేయడమే కాకుండా, పెద్ద పేగు క్యాన్సర్, గుండె జబ్బుల వంటి వాటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తాండ్రలో ఉండే పీచు పదార్థం పేగు కదలికలను క్రమబద్ధీకరించడంతో పాటు జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. జర్నల్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం తాండ్రలో ఉపయోగించే మామిడి గుజ్జులో జీర్ణ ప్రక్రియకు దోహదపడే ఎంజైమ్‌లు ఉన్నాయి. ఇవి కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలను విచ్ఛిన్నం చేయడం ద్వారా జీర్ణక్రియను మెరుగు పరచడంలో సహాయపడతాయి. ఇందులో శరీర ఆరోగ్యానికి ఉపయోగపడే ఐరన్, కాల్షియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. అలాగే, చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. త్వరగా వచ్చే వృద్ధాప్య లక్షణాలను నిరోధిస్తుంది.

మితమే హితం

సమతుల ఆహారంలో భాగంగా తాండ్రను తగిన పాళ్లలో తీసుకోవడమే ఉత్తమమని చెబుతారు. ఇందులో చక్కెర, కేలరీలు ఎక్కువగా ఉన్నందున అధికంగా తినరాదు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు కాస్త జాగ్రత్తలు పాటించాలి. అధికంగా తింటే దంత క్షయం, ఊబకాయం వంటి సమస్యలు రావచ్చు.

అలవాటైన వ్యాపారం



తాండ్ర పరిశ్రమ మాకు అలవాటైన వ్యాపారంగా మారింది. ఏటా సీజన్‌లో లభ్యమయ్యే మామిడి కాయలను స్థానికంగాను, కృష్ణా, విజయనగరం, విశాఖతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. మామిడికాయలు సీజనల్‌గానే లభ్యమవడంతో తాండ్ర తయారీకి అవసమయ్యే జ్యూస్‌ను ఏడాదికి సరిపడేలా నిల్వ ఉంచుకుంటున్నాం. ఒక్కో పరిశ్రమలో వంద మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. రోజుకు మగవారికి రూ.800 నుంచి రూ.900 వరకూ, ఆడవారికి రూ.600 వరకూ కూలి ఇస్తున్నాం. తాండ్ర ధర ప్రస్తుతం కేజీ రూ.100 వరకూ ఉంది. తాండ్ర తయారీ ద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామనే సంతృప్తి ఉంది.

– వలవల వెంకటేశ్వరరావు,
తాండ్ర తయారీదారు, పండూరు, కాకినాడ రూరల్

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడి మృతి



ఘటనా స్థలంలో సురేష్ మృతదేహం

రాజానగరం: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. రాజమహేంద్రవరం – కేశవరం రోడ్డులోని జి.యర్రంపాలెం వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. రాజమహేంద్రవరంలోని శాటిలైట్ సిటీకి చెందిన అంగారపు సురేష్ (37) చెక్క మంచాలు చేసి, గ్రామాలలో విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతడికి రెండు నెలల క్రితమే వివాహమైంది. ఈ క్రమంలో జి.యర్రంపాలెంలో మంచాలకు సంబంధించిన సొమ్ములు వసూలు చేసుకునేందుకుగాను మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. జి.యర్రంపాలెం వెళ్తున్న అతడిని మట్టి లోడుతో వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఆ మలుపులో ఎగువ నుంచి వెళ్లాల్సిన లారీ దిగువకు రావడంతో ఈ ప్రమాదం జరిగింది. సురేష్‌పై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం



సీతానగరంలో కాలిపోయిన తాటాకిల్లు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో ఆసనాల లక్ష్మికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఆదివారం ఉదయం 9 గంటలకు గ్యాస్ స్టవ్ వెలిగించగా, రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న కర్టెన్‌కు అంటుకుని ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, రెండు ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ, వంటసామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.

సాగులో యంత్రసాయం

- వ్యవసాయంలో పెరిగిన యంత్రాలు
- అన్ని పనులలో రైతులకు చేదోడు
- ఎండుగడ్డి కట్టలకూ అవే వినియోగం



ఎండుగడ్డిని కట్టలుగా కడుతున్న యంత్రం



పొలాల్లో ఎండుగడ్డి కట్టలు

రాయవరం: ఇటీవల వరి సాగులో యంత్రాల ప్రాధాన్యం పెరిగింది. దాదాపు 95 శాతానికి పైగా పంటను యంత్రాలతోనే కోయిస్తున్నారు. భూమిని దమ్ము చేయడం దగ్గరి నుంచి నాట్లు వేయడం, పురుగు మందుల పిచికారీ, పంట మాసూళ్ల వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు వరి చేనును కోత యంత్రాలతో కోసి, పొలాల్లో వదిలేసిన గడ్డిని కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్ద మొత్తంలో సబ్సిడీపై యంత్రాలకు రుణాలు అందజేయడంతో గ్రామాల్లోని రైతులు కమిటీలుగా ఏర్పడి వివిధ రకాలు యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు.

సులువైన పని

వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల సాగు పనులు రైతులకు చాలా సులువుగా మారాయి. ముఖ్యంగా వరి కోతల సమయంలో కూలీల కొరతతో గతంలో ఇబ్బందులు పడేవారు. కోత యంత్రాలు రావడంతో పని సులువైంది. ఖర్చు తగ్గింది. అయితే మెషీన్‌తో కోయగా వచ్చిన గడ్డి పశువులకు దాణాగా ఉపయోగపడదని రైతులు భావించేవారు. దాన్ని అలాగే చేలల్లో వదిలేసేవారు. కానీ అది కేవలం అపోహ అని, ఆ గడ్డిలోనూ పోషకాలు ఉంటాయని, పైగా చిన్న ముక్కలుగా తెగిన గడ్డి పశువులకు త్వరగా జీర్ణమవుతుందని పశుసంవర్ధకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో రైతులు ప్రత్యేక యంత్రాల సాయంలో ఆ గడ్డిని కట్టలు కట్టించి, పశువులకు దాణాగా ఉపయోగిస్తున్నారు. యంత్రాలు అన్ని పనుల్లో రైతులకు చేదోడుగా మారాయి.

యంత్రాల వినియోగం

కోనసీమ జిల్లాలో ప్రధానంగా దాళ్వా సీజన్‌లో పంట మాసులుకు యంత్రాలను ఉపయోగించడం పరిపాటిగా మారింది. యంత్రంతో పంట మాసూళ్ల చేయడం వల్ల వరి గడ్డి ముక్కలు ముక్కలుగా తెగిపోతుంది. ఈ ముక్కలుగా తెగిన గడ్డిని పశువులకు మేతగా వేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని భావించి చేలల్లోనే తగలబెట్టేవారు. దీంతో పశువులకు ఎండుగడ్డి ఏర్పడేది. కొన్ని సమయాల్లో ఇతర జిల్లాల నుంచి గడ్డిని కొనుగోలు చేసేవారు. ఎకరం గడ్డి సుమారు రూ.6 వేలు నుంచి రూ.8 వేలు పలికేది. దీంతో పశువుల పెంపకం చాలా కష్టంగా మారింది.

వృథా కాదు.. పోషకాహారం

వరి కోత యంత్రాలతో మాసూలు చేసిన గడ్డి కూడా పశువులకు ఉపయోగపడుతుందని రైతులకు పశుసంవర్ధకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ముక్కలైన గడ్డిని తినడం వల్ల పశువులకు త్వరగా జీర్ణం అవుతుందని తెలిపారు. దీంతో రైతులు యంత్రాల ద్వారా మాసూలు చేయగా వచ్చిన గడ్డిని పశువులకు మేతగా ఉపయోగించడాన్ని అలవాటు చేసుకున్నారు.

జిల్లాలో 2.29 లక్షల పశువులు

జిల్లాలో దాదాపు 2.29 లక్షల పశువులు ఉన్నాయి. వీటిలో 75,460 ఆవులు, 1,53,542 గేదెలు ఉన్నాయి. వరికోత యంత్రాల ద్వారా మాసూలు చేసిన గడ్డిని పశువులు కూడా బాగా తింటున్నాయి. దీంతో ఆ గడ్డిని కట్టలు కట్టడానికి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గుంటూరు ప్రాంతం ఉంచి గడ్డిని కట్టలు కట్టే యంత్రాలు మన ప్రాంతానికి వస్తున్నాయి. వీటి ద్వారా కట్టలు కట్టించి ట్రాక్టర్లతో గట్టుకు చేర్చి గడ్డివాములుగా వేస్తున్నారు. ఇలా చేయడానికి ఒక్కో కట్టకు రూ.35 వసూలు చేస్తున్నారు. దీనికి రవాణా, కూలి ఖర్చులు అదనంగా ఉంటాయి. ఎకరం గడ్డిని కట్టలుగా కట్టించడానికి సుమారు రూ.2 వేల వరకూ ఖర్చవుతుంది.

ఆ గడ్డినే వినియోగిస్తున్నాం



గతంలో వరి కోత యంత్రాలతో మాసూలు చేసిన గడ్డిని వృథాగా వదిలేసేవాళ్లం. అది పశువులకు దాణాగా ఉపయోగపడదని భావించేవాళ్లం. పశుసంవర్ధకశాఖ అధికారుల సలహాతో ఆ గడ్డినే పశువులకు వేస్తున్నాం. యంత్రంతో కట్టలు కట్టించి, గడ్డివామిగా వేసి, అనంతరం పశువులకు ఉపయోగిస్తున్నాం.

– చేవా సత్యనారాయణ, రైతు, లొల్ల, రాయవరం మండలం

అవగాహన పెరిగింది



గడ్డిని కట్టలుగా చుట్టే యంత్రాలు రాని సమయంలో ఎండు గడ్డి వృథా అయ్యేది. గడ్డిని బెయిలింగ్ చేసే యంత్రాలు రావడం చాలా ఉపయోగంగా ఉంది. పశువులకు గడ్డి కొరత తీరింది. చాలామంది రైతులు అవగాహన పెంచుకున్నారు. పశువులకు మేత కొరత లేకుండా చూసుకుంటున్నారు.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, అమలాపురం

ఘనంగా సత్యదేవుని రథోత్సవ సేవ



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవార్ల రథోత్సవ సేవను ఆదివారం ఉదయం ఆలయ ప్రాకారంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పురాజ గోపురం ముందుకు తీసుకువచ్చారు. దానిపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేసి పూజలు జరిపారు. అనంతరం భక్తులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో కలిసి ఆలయ ప్రాకారంలో మూడుసార్లు రథంతో ప్రదక్షిణ నిర్వహించారు. రథోత్సవం అనంతరం పూజలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, ముష్టి పురుషోత్తం, చిట్టి శివ ఘనాపాఠీ, యనమండ్ర శర్మ, అర్చకులు చిట్టెం గోపి, పరిచారకులు ముత్య వెంకట్రావు, యడవిల్లి ప్రసాద్, ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

28న రగ్బీ పోటీలకు ఎంపిక

పిఠాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో మంగళవారం ఉమ్మడి జిల్లా అండర్ –18 బాలురు, బాలికల ఎంపిక జరగనుంది. 2006, 2007, 2008 సంవత్సరాలలో పుట్టిన వారు అర్హులని అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, కోచ్ లక్ష్మణరావు తెలిపారు.

ఆదుకున్న మానవత్వం

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- చికిత్స పొందుతూ చిన్నారి కన్నుమూత
- బాధిత కుటుంబానికి స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం

రాయవరం: ఒక రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ప్రమాద స్థలంలో తండ్రి మృతి చెందగా, కుమార్తె చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. తల్లి, చిన్న కుమార్తె అనాథలుగా మిగలారు. ఆ కుటుంబ సభ్యులను శ్రీ ముసలమ్మ తల్లి కేర్ క్లబ్ మానవత్వంతో ఆదుకుంది. వివరాల్లోకి వెళితే.. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన దాసరి శ్రీను (35), పెద్ద కుమార్తె లలిత ఈ నెల 17న కొత్తపేట మండలం వాడపాలెం వెళ్లారు. అమ్మమ్మ గారి ఇంటి నుంచి తిరిగి సోమేశ్వరం వస్తున్న సమయంలో మండపేట మండలం వీరభద్రపురం వద్ద వీరి మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొంది. అక్కడికక్కడే శ్రీను మృతి చెందగా, లలిత కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 21న మృతి చెందింది. దీంతో శ్రీను భార్య మణి, చిన్న కుమార్తె సత్యశ్రీ అనాథలుగా మిగిలారు. భర్తను, పెద్ద కుమార్తెను కోల్పోయిన మణి జీవచ్ఛవంగా మిగిలింది.

కేర్ తీసుకున్న క్లబ్ సభ్యులు

రహదారి ప్రమాదంలో శ్రీను మృతి చెందడం, చిన్న కుమార్తె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న సోమేశ్వరం శెట్టిబలిజ వీధికి చెందిన శ్రీ ముసలమ్మ తల్లి కేర్ క్లబ్ మానవత్వాన్ని చాటుకుంది. క్లబ్ నిర్వాహకుడు గుత్తుల శివ తన మిత్రులతో కలిసి బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఫండ్ డొనేషన్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. తొలుత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లలిత వైద్యం నిమిత్తం విరాళాలు సేకరించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా విషయాన్ని తెలియజేసి దాతల నుంచి విరాళాలు సేకరించారు. అయితే ఈ లోపు లలిత ఆరోగ్యం విషమించి అందని లోకాలకు చేరుకుంది. అప్పటికే విరాళాల రూపంలో సేకరించిన సొమ్ము రూ.2,02,464ను క్లబ్ సభ్యులు.. శ్రీను రెండో కుమార్తె సత్యశ్రీ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు శ్రీముసలమ్మ తల్లి కేర్ క్లబ్ చేస్తున్న కార్యకలాపాలను గ్రామస్తులు అభినందించారు. ఇప్పటి వరకు క్లబ్ ద్వారా పలువురిని ఆదుకున్నామని, భవిష్యత్తులో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు మరింత కృషి చేస్తామని క్లబ్ నిర్వాహకుడు శివ తెలిపారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని సత్యశ్రీకి అందజేస్తున్న శ్రీముసలమ్మ తల్లి కేర్ క్లబ్ సభ్యులు

గోమాత యాతన



డ్రైనేజీ పక్కనే గొయ్యిలో పడిపోయిన ఆవు



ఎట్టకేలకు సురక్షితంగా బయటపడిన ఆవు

యానాం: కొత్త డ్రైనేజీలను నిర్మించిన తర్వాత రెండు వైపులా ఖాళీలను పూడ్చకపోవడంతో మూగజీవాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. గోపాల్ నగర్ దారిలోని మూడు తూముల జంక్షన్‌కు వెళ్లే ప్రదేశం వద్ద మేత మేస్తున్న గర్భంతో ఉన్న ఆవు పక్కనే ఉన్న ఆరడుగుల లోతైన గొయ్యిలో పడిపోయింది. అటుగా వెళుతున్నవారు గమనించి ఆ ఆవును బయటకు తీసేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. స్థానికంగా నివసిస్తున్న డాక్టర్ దయానా తదితరులు స్పందించి ప్రొక్లెయిన్ రప్పించారు. గొయ్యిలోంచి బయటకు రావడానికి వీలుగా దారి చేయడంతో ఆవు సురక్షితంగా బయటకు వచ్చింది.

వీరేశ్వరస్వామికి జస్టిస్ వెంకటరాములు పూజలు



జస్టిస్ వెంకట రాములు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని తెలంగాణ లోకాయుక్త జస్టిస్ సి.వెంకట రాములు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పట్టువస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం కుమారుడి వివాహ నిమిత్తం నిత్య కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

చనిపోయిన చేపల తరలింపు



చనిపోయిన చేపలను ట్రాక్టర్‌పై లోడ్ చేసిన దృశ్యం

యానాం: నల్ల చెరువు ఆవరణలోని ఒక చెరువులో మృత్యువాత పడిన చేపలను ఆదివారం ట్రాక్టర్‌పై తరలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పెసల వెంకటేష్, కాదా పవన్, హరి ప్రసాద్ మాట్లాడుతూ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ శాఖ పరిధిలోని రక్షిత మంచినీటి చెరువుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చేపలు చనిపోయిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంచినీటి చెరువుల నిర్వహణ, ఆధునీకరణ, రక్షణ తదితర అంశాలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పీడబ్ల్యూడీ శాఖకు ఏటా కోట్లాది రూపాయలను బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. కొందరు పీడబ్ల్యూడీ అధికారులు తమ రాజకీయ పలుకుబడితో ఏళ్ల తరబడి ఇక్కడే ఉండిపోయారని ఆరోపించారు.

ఫైనాన్స్ వ్యాపారి అదృశ్యం



సత్యరామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

రాయవరం: మండలంలోని పసలపూడికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నల్లమిల్లి సత్యరామ్మోహన్‌రెడ్డి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.నరేష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఒడిశాలోని రాయఘడ్‌లో సత్యరామ్మోహన్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం ముగించుకుని ఏప్రిల్ 21న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాయఘడ్ నుంచి పసలపూడి బయలుదేరాడు. అనంతరం విశాఖపట్నం చేరుకున్నట్లుగా భార్య మౌనికకు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దీంతో భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆనాటి స్నేహం.. అద్భుత జ్ఞాపకం..

- అంబాజీపేట హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- తరలివచ్చిన స్నేహితులు



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



అంబాజీపేట హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: చదువులమ్మ చెట్టు నీడలో విద్యాబుద్ధులు నేర్చుకున్న స్నేహితులందరూ తిరిగి అదే చెట్టు నీడన జ్ఞాపకాలతో సేదతీరారు. దీనికి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం వేదికైంది. స్థానిక ఉన్నత పాఠశాలలో 1998 – 99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. తొలుత సభా వేదిక పైకి వెళ్లి ఒక్కొక్కరిగా పరిచయం చేసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు, ఆటలు, అల్లర్లు, నిక్‌నేమ్‌లు గుర్తుకు తెచ్చుకుంటూ ఒకరినొకరు పిలుచుకుంటూ చిన్న పిల్లల్లా మారిపోయి ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులతో యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా సందడి చేశారు. వివిధ వృత్తులు, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి పలు ప్రాంతాల్లో ఉన్న వారంతా తరలివచ్చారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని, తోటి విద్యార్థులకు సాయపడదామని తీర్మానాలు చేసుకున్నారు. విద్యార్థులందరూ వినోద కార్యక్రమాల్లో పాల్గొని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలకు బీరువాను బహూకరించారు. తోటి విద్యార్థి, అంబాజీపేటకు చెందిన కొవ్వూరి వెంకటేశ్వరరావు ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడటంతో అతనికి ఆర్థిక సాయం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 15 మంది గురువులను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన స్నేహితులను, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో రావూరి రాంబాబు, యర్రంశెట్టి సూరిబాబు, పొట్టుపోతు నాయుడు, క్రాంతి, బేగం, చందన తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ నుంచి వచ్చా



స్నేహితులందరినీ చూడాలనే ఆతృతతో సింగపూర్ నుంచి వచ్చాను. ఇక్కడ వీరందరినీ చూశాక ఎంతో ఆనందంగా ఉంది. తిరిగి మరోసారి కలిసేంత వరకు ఈ జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుంటాను.

– శనగల పార్వతి, అడ్మిన్, సింగపూర్

మధుర జ్ఞాపకాలు



పాతికేళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న వారందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు తోటి స్నేహితులు చాలా కష్టపడ్డారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా వెళ్లిన వారిని ఆత్మీయ సమ్మేళనానికి వచ్చేలా కృషి చేశాం. ఒకేసారి అందరినీ కలవడంతో పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. ఆత్మీయ సమ్మేళనం మాకు మధుర జ్ఞాపకాలు అందించింది.

– తెలగరెడ్డి వీరభగవాన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత ఫొటోగ్రాఫర్

ఆనాటి రోజులు గుర్తొచ్చాయి



అంబాజీపేట హైస్కూల్లో చదువుకున్న ఆనాటి రోజులు, మధుర జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. 25 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయి, అప్పటి విద్యార్థి మారిపోయి స్నేహితులతో ఆనందంగా గడిపాను.

– మేడిద కాశీ, గేమ్ డెవలపర్, బెంగళూరు

ఏడాది నుంచి కృషి చేశా



మిత్రులందరినీ ఒకే వేదిక పైకి తీసుకు వచ్చేందుకు గత ఏడాది నుంచి నా స్నేహితులతో కృషి చేశాను. మా అందరి కృషి ఫలించడంతో ఎంతో ఆనందం కలిగింది. ఈ మధుర క్షణాల కోసం ఏడాదిగా ఎదురు చూశాం. ఆత్మీయ కలయిక ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చింది.

– ఆకుల శ్రీనివాస్, షిపిని విభాగంలో సాఫ్ట్‌వేర్, డీఆర్‌డీఏ, హైదరాబాద్

స్నేహితుల సహకారం



25 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న నా తోటి విద్యార్థినుల వివరాలను స్నేహితుల సహకారంతో సేకరించాను. ఒక్కొక్కరికీ సమాచారం అందించి ఒకే వేదిక పైకి తీసుకువచ్చేలా కృషి చేశాను. ఆత్మీయ కలయికకు అందరూ రావడం చాలా ఆనందంగా ఉంది.

– బొక్కా మహాలక్ష్మి, హిందీ టీచర్, గొల్లవిల్లి